క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల తనిఖీ



జూకల్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గ్రేస్‌బాయి

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని వీరోజీపల్లి, జూకల్, రామోజిపల్లి తదితర గ్రామాల్లో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గ్రేస్‌బాయి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించారు. రైతులు ఆందోళన చెందొద్దని పూర్తి ధాన్యం కొనుగోలు చేస్తామని ఆమె వారికి తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రవీందర్ తదితరులు ఉన్నారు.

తునికి ఈఓగా శ్రీనివాస్‌ను నియమించొద్దు



మాట్లాడుతున్న రాకేశ్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం ఈఓ సార శ్రీనివాస్‌ను నియమించొద్దని బీజేపీ మండలాధ్యక్షుడు రాకేశ్ తెలిపారు. శుక్రవారం కౌడిపల్లిలో ఆయన మాట్లాడుతూ.. ఈఓ మోహన్‌రెడ్డి పదవీ విరమణ పొందుతున్నట్లు చెప్పారు. దీంతో కొత్తగా తునికి ఈఓగా గతంలో ఇక్కడ నిర్వహించిన సార శ్రీనివాస్‌ను నియమించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు సమాచారం ఉందని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఇక్కడ ఈఓ సార శ్రీనివాస్ పనిచేసినప్పుడు మాజీ ఎమ్మెల్యే అమ్మవారికి సమర్పించిన బంగారం, వెండి వస్తువులు నిబంధనలకు విరుద్ధంగా ఈఓ తన ఇంటిలో ఉంచుకున్నారని విమర్శించారు.బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మహంకాళి ఆలయ ఈఓగా రవికుమార్‌శర్మ



రామాయంపేట(మెదక్): రామాయంపేట మహంకాళి ఆలయ కార్యనిర్వాహణ అధికారి (ఈవో)గా రవికుమార్ శర్మ నియమితులయ్యారు. ఇంతకుముందు ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న మోహన్‌రెడ్డి పదవీ విరమణతో ప్రభుత్వం రవికుమార్‌శర్మను నియమించింది. ఈమేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ పాండురంగాచారి, సిద్దిపేట వీర హనుమాన్ ఆలయ జూనియర్ అసిస్టెంట్ చంద్రప్రకాశ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా గంగాభవాని ఆలయ వార్షికోత్సవం



కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో గంగాభవాని ఆలయ 36వ వార్షికోత్సవ వేడుకలు గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, స్థాపిత దేవతలకు పంచామృత అభిషేకం, హోమం, కల్యాణ మహోత్సవం నిర్వహించారు. వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ



రైతు వేదికలో టోకెన్లు తీసుకుంటున్న రైతులు

నర్సాపూర్: మండలానికి 90 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి వచ్చిన జీలుగ విత్తనాల కోసం రైతు వేదికలో రైతులకు పర్మిట్లు రాసి ఇచ్చామన్నారు. విత్తనాల డీలరు వద్ద రైతులు విత్తనాలు పొందేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. మరో 90 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు త్వరలో వస్తాయని వివరించారు.

హైవేరోడ్డు అస్తవ్యస్తం

- మూడేళ్లకే పెచ్చులూడిపోతున్న 161 హైవే బ్రిడ్జి
- రోడ్డు నిర్మాణంలో నాణ్యతపై ప్రయాణికుల అనుమానాలు
- పట్టించుకోని అధికారులు



హైవే చిల్వెర బ్రిడ్జి వద్ద పెచ్చులూడి తెలిన ఇటుకలు

అల్లాదుర్గం(మెదక్): వేల కోట్లతో వేసిన రోడ్డు, బ్రిడ్జిలు మూడేళ్లకే పెచ్చులూడి పోతున్నాయి. నాణ్యతకు తూట్లు పొడిచి పనులు చేపట్టడంతో ఏళ్ల తరబడి ఉండాల్సిన రోడ్లు నాలుగైదేళ్లకే నాశనమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపణలున్నాయి. హైవే రోడ్డు నిర్వహణకు కోట్ల రూపాయల నిధులు మంజూరవుతున్నా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో, నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇది సంగారెడ్డి, అకోలా 161 జాతీయ రహదారి దుస్థితి. సంగారెడ్డి నుంచి మద్నూర్ వరకు 161 జాతీయ రహదారి నిర్మాణం పనులు 2018లో ప్రారంభమయ్యాయి. అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ నుంచి కామారెడ్డి జిల్లా మగ్దూర్ వరకు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేందుకు రైతుల నుంచి భూములు తీసుకొని హైవే రోడ్డు నిర్మాణం చేపట్టారు. వేల కోట్ల రూపాయలతో రోడ్డు, గ్రామాల పెద్ద పెద్ద బ్రిడ్జిలు నిర్మించారు. ఈ రోడ్డు పనులు పూర్తయి మూడేళ్ల మాత్రమే కావొస్తున్నా.. అప్పుడే బ్రిడ్జిల వద్ద పెచ్చులూడి పోతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. బ్రిడ్జి పెచ్చులూడి పెద్ద పెద్ద సిమెంట్ పెచ్చులు పడటంతో తృటిలో ప్రమాదాలు తప్పుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక, కాంట్రాక్టర్ నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ముస్లాపూర్ శివారులో రోడ్డు చెడిపోయి, మధ్యలో రంధ్రం పడితే అధికారులు మరమ్మతులు చేయించారు. చాలా చోట్ల రోడ్డు చేడిపోతే మరమ్మతులు చేయడంతో నాణ్యతపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేల కోట్ల నిధులతో చేపడుతున్న పనులపై అధికారుల నిర్లక్ష్యం, అలసత్వంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైన హైవే అధికారులు విచారణ చేపట్టి, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన అల్లాదుర్గం బ్రిడ్జి

వివక్ష చూపితే కఠిన చర్యలు

- తహసీల్దార్ రజనీకుమారి



సుతారిపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ రజనీకుమారి

రామాయంపేట(మెదక్): గ్రామాల్లో కుల మతాలకు అతీతంగా ఉండాలని తహసీల్దార్ రజనీకుమారి పేర్కొన్నారు. మండలంలోని సుతారిపల్లిలో శుక్రవారం నిర్వహించిన సివిల్ రైట్స్‌డే కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. అంటరానితనం నిర్మూలన కోసం అందరూ కృషి చేయాలన్నారు. రెండు గ్లాసుల పద్ధతి పాటించవద్దని సూచించారు. గ్రామాల్లో ఎవరినైనా కులం పేరుతో దూషించినా, దాడులు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో గ్రామంలోని యువకులు గ్రామస్తులను చైతన్యపర్చాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో శనివారం ఉదయం మరమ్మతులు నిర్వహించడంతో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏఈ స్వామి తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందిస్తున్న కాంగ్రెస్ నియోజకర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్: అత్యవసర వైద్యం అవసరమైన వారికి ఎల్‌ఓసీ ఎంతో మేలు చేస్తుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కొల్చారం మండలంలోని చిన్నఘనపూర్ గ్రామానికి చెందిన ఎరుకల రత్నయ్యకు వైద్యం కోసం రూ.ఒకలక్ష 75వేల ఎల్‌ఓసీ లెటర్‌ను అతని కుమారుడు దుర్గప్రసాద్‌కు అందజేశారు. పేదలకు అత్యవసర వైద్యం కోసం ప్రభుత్వం ఎల్‌ఓసీ ఇచ్చి ఆదుకుంటుందని చెప్పారు. ఎల్‌ఓసీ ఇచ్చినప్పుడు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముత్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి రూ. 1.20లక్షల ఎల్‌ఓసీని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ

నర్సాపూర్: నర్సాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నాగరాజుగౌడ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శుక్రవారం అంబలి పంపిణీ చేశారు. తన తల్లిదండ్రులు కమలమ్మ, వెంకటస్వామిగౌడ్‌ల జ్ఞాపకార్థం నర్సాపూర్‌లో సంత రోజైనా ప్రతీ శుక్రవారం అంబలి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

ధూమపానం ఆరోగ్యానికి చేటు



పెద్దశంకరంపేటలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలు ధూమపానానికి దూరంగా ఉండాలని వైద్యురాలు వేదశ్రీ అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్యశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పొగాకు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు వైద్యుల సూచనలు పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది యాదయ్య, సాయిలు, వెంకటేశం తదితరులున్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): పొగాకుతో జరిగే అనర్థాలను వివరిస్తున్న వైద్యులు మనోహరాబాద్ పీహెచ్‌సీలో ..

మనోహరాబాద్(తూప్రాన్): టోబాకో(పొగాకు) వలన ప్రజలకు ప్రాణనష్టం కల్గుతుందని పీహెచ్‌సీ వైద్యులు వికాస్, డీఐఓ డాక్టర్ మాధురి అన్నారు. శుక్రవారం ప్రపంచ పోగాకు నిరోధక దినోత్సవాల్లో భాగంగా మనోహరాబాద్ పీహెచ్‌సీలో పోగాకుతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా ప్రతీ ఒక్కరు పోగాకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం, స్థానికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి సన్మానం

నర్సాపూర్: పదవి విరమణ పొందిన పారిశుద్ధ్య కార్మికురాలిని శుక్రవారం పదవి విరమణను పురస్కరించుకొని సన్మానించారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలుగా పని చేస్తున్న సాయమ్మ దంపతులను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కార్యాలయ సూపరింటెండెంట్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఉద్యోగ విరమణ సహజం: కలెక్టర్



అదనపు కలెక్టర్ రమేశ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: వృత్తిగా కాకుండా సేవా భావంతో అదనపు కలెక్టర్ రమేశ్ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రమేశ్ పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం పట్టణ శివారులోని ఓ గార్డెన్‌లో జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పనిసరని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మెదక్ డీపీఆర్‌ఓ కార్యాలయంలో ఆడియో విజువల్ సూపర్‌వైజర్ (ఏవీఎస్)గా చేరిన సుబ్రహ్మణ్యం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓడిపై రాజభవన్‌లో సేవలందించారు. శుక్రవారం ఉద్యోగ విరమణ సందర్భంగా కలెక్టర్ ఆయనను సన్మానించారు.

ఈఓ మోహన్‌రెడ్డి సేవలు అనిర్వచనీయం



పాపన్నపేట(మెదక్): ఈఓను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల అభివృద్ధికి ఈఓ మోహన్‌రెడ్డి చేసిన సేవలు అనిర్వచనీయమని పాలక వర్గ చైర్మన్ బాలాగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఏడుపాయలలో ఈఓ మోహన్ రెడ్డిని పదవీ విరమణ సందర్భంగా సన్మానించారు. ముఖ్య అతిథి బాలాగౌడ్ మాట్లాడారు. అనంతరం ఈఓ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, ఎంపీటీసీలు విజయేందర్‌రెడ్డి, శ్రీనివాస్, టీఎన్జీవో ఉద్యోగ సంఘాల నాయకులు దొంతి నరేందర్, అచ్చన్నపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, వివిధ ఆలయాల ఉద్యోగులు, మాజీ చైర్మన్లు నర్సింలు, నర్సింలు గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి సేవలు మరువలేనివని ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లపోచమ్మదేవి ఆలయ ఈఓ పదవీవిరమణ పొందడంతో మాజీ ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఈఓ మోహన్‌రెడ్డి, విజయ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సాయిలు, అమర్‌సింగ్, మాజీ ఉపసర్పంచ్ మానిక్యరెడ్డి, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వీరభద్రుడి ఉత్సవాలు



పాచిబండ్లను ఊరేగిస్తున్న భక్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో వారం రోజులుగా కొనసాగిన భద్రకాళీ సమేత వీరభద్రుడి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి లంకాదహనం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున బాణీ సంచా కాల్చారు. శుక్రవారం ఉదయం పాచిబండ్లను డోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ ఊరేగించారు. భక్తులు స్వామివారికి అభిషేకం, అర్చన, గణపతిపూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్, వైస్ చైర్మన్ ఈశ్వరప్పలు కులసంఘాల పెద్దలను సన్మానించారు. వంతం చేసిన గ్రామపెద్దలకు, నాయకులకు యువకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



రంగంపేటలో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఏఓ కోటేశ్వర్‌రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంతో పాటు రంగంపేట, దుంపలకుంట చౌరస్తాలోని ఫర్టిలైజర్ దుకాణాలను విజిలెన్స్ ఏఓ కోటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా స్టాక్ దుకాణాల్లో ఉన్న సీడ్స్ ఎరువులను పరిశీలించడంతో పాటు అమ్మకాలకు సంబంధించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించొద్దన్నారు. రైతులు కొనుగోలు చేసే విత్తన కొనుగోలు రసీదులను తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణదారులను ఆదేశించారు. దుంపలకుంట రైతు ఆగ్రో సేవా కేంద్రంలో రైతులకు జీలుగ విత్తనాలను అందజేశారు. ఆయన వెంట కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి, ఏఓ శ్వేతా కుమారి, సేవా కేంద్రం నిర్వాహకుడు రాజా గౌడ్, రైతులు ఉన్నారు.

గృహహింస, వరకట్న వేధింపులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సఖి కేంద్రం సిబ్బంది

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని సీతానగర్ తండాలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో సఖికేంద్రం ఆధ్వర్యంలో కేస్ వర్కర్ స్వప్న అవగాహన కల్పించారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గృహహింస, వరకట్న వేధింపులు, అత్యాచారాలు, యాసిడ్ దాడులు, అక్రమ రవాణా, పనిచేసే చోట లైంగిక వేధింపులు, శారీరకంగా, మానసికంగా, లైంగికంగా, ఆర్థికంగా హింసకు గురైతే మహిళలు సఖి కేంద్రానికి నేరుగా, 181 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సంప్రదించవచ్చునని తెలిపారు. బాల్య వివాహాలు చేయటం వల్ల వచ్చే ఆనారోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలను వివరించి 1098 టోల్ ఫ్రీ నెంబర్‌ను తెలిపారు. సైబర్ నేరాలు జరిగితే 1930 నంబర్‌కి కాల్ చేయాలన్నారు. బాధిత మహిళలు ఏదైనా హింస వేధింపుల సమస్యతో వచ్చినప్పుడు ఆమె గాయాలతో ఉంటే మెడికల్ సపోర్ట్, సైకో సోషల్ కౌన్సిలింగ్, లీగల్ కౌన్సిలింగ్ (మహిళలకు బాలికలకు ఉన్న చట్టాల పై), పోలీస్ సపోర్ట్, బాధిత మహిళకు కుటుంబ సపోర్టు లేని పరిస్థితిలో ఉన్న వారికి తాత్కాలిక వసతి, మహిళలకు హింస జరిగినప్పుడు 181 రెస్క్యూ వెహికల్ వచ్చి కావాల్సిన సహకారాన్ని అందిస్తామన్నారు. మహిళలకు, బాలికలకు, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు కింది టోల్ ఫ్రీ నంబర్లను181,112,1098, 18004198588, 1930 సంప్రదించాలని వివరించారు.

సంక్షిప్త వార్తలు

◆ **గోశాలకు పశుగ్రాసం అందజేత**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి ఆలయ పరిధిలో ఉన్న గోశాలకు దాత శుక్రవారం ఎండు పశుగ్రాసం అందజేశారు. శివ్వంపేటలకు చెందిన భార్గవి విజయ్‌కుమార్ దంపతుల పెళ్లి రోజు సందర్భంగా గోశాలకు గ్రాసం అందజేశారు. గోశాలకు పశుగ్రాసం కొరత ఉందని దాతలు ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు.

◆ **మాల విరమణకు బయలుదేరిన హనుమాన్ భక్తులు**



వెల్దుర్తి(తూప్రాన్): కొద్ది రోజులుగా నియమ నిష్టలతో మాలలు ధరించిన హనుమాన్ భక్తులు మాల విరమణకు భద్రాచలం దేవాలయానికి బయలుదేరారు. వేకువ జామునే గురుస్వామి భక్తులకు ఇరుముడులు కట్టారు. కార్యక్రమంలో మాలాధారణ భక్తులు గణేశ్‌గుప్తా, వెంకటేశం, చందు, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి**

వెల్దుర్తి(తూప్రాన్): బురదలో తెగిపడిన విద్యుత్ తీగలతో షాక్ తగిలి పాడిగేదె మృతి చెందిన ఘటన మండల కేంద్రం వెల్దుర్తిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఉప్పల రవి వ్యవసాయంతో పాటు పశుపోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగా శుక్రవారం ఉదయం తన గేదెలను మేతకు వదిలాడు. కొద్ది సేపటికి బురదలో తెగిపడిన విద్యుత్ తీగల వలన షాక్‌కు గురై పాడిగేదె అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాదంలో సుమారు రూ.90 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. ప్రమాదస్థలాన్ని వెటర్నరీ వైద్యాధికారిణి డా.రేఖరసజ్ఞ సందర్శించి పంచనామా నిర్వహించారు.

◆ **పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం**



మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెదమ్మతల్లి ఆలయ నిర్మాణానికి హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన వీఎన్ రాజు రూ. 2.5 లక్షలను శక్రవారం వితరణ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు (కరాటే) మల్లేశ్, మాజీ సర్పంచ్ మల్లేశ్, నాయకులు గిరిధర్, భిక్షపతి, శ్రీశైలం, సత్యనారాయణ, దాచారం నాగరాజు, గోపాల్, నరేష్, తదితరులున్నారు.

◆ **ఆ ఈఓ వద్దని ఫిర్యాదు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయానికి కొత్త ఈఓగా సార శ్రీనివాస్‌ను నియమించొద్దని కాంగ్రెస్ జిల్లా నాయకుడు చంద్రం కృష్ణాగౌడ్ దేవాదయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశానని తెలిపారు.

◆ **బడిబాటను విజయవంతం చేయండి**

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఈనెల 3 నుంచి బడిబాట నిర్వహించి విజయవంతం చేయాలని ఐసీడీఎస్ శివ్వంపేట సెక్టర్ సూపర్‌వైజర్ సంతోష తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం శివ్వంపేటలో అంగన్‌వాడీ టీచర్లతో సెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగాన్‌వాడీ కేంద్రాలవారీగా రికార్డులు, ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రిగార్డెన్ పెంచాలని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్, ఆయ సమయపాలన పాటించాలని హెచ్చరించారు.

◆ **నకిలీ విత్తనాలతో మోసపోవద్దు**

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోలుపై శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు నకిలీ విత్తనాలతో మోసపోకుండా రసీదులను తీసుకోవాలని సూచించారు. చేగుంట, పోతాన్‌శెట్టిపల్లి, మక్కరాజీపేట గ్రామాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఏఓ హరిప్రసాద్, ఏఈఓలు శోభారాణి, భువనేశ్వరీ, మాధవి, తదితరులు ఉన్నారు.

◆ **ప్రజలు కలిసి మెలిసి ఉండాలి**

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజలు కలిసి మెలిసి ఉండాలని ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని అల్లీపూర్‌లో సివిల్‌రైట్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామంలో సమస్యలుంటే పోలీసులకు తెలియచేయాలని చెప్పారు.

◆ **ఉత్సవ ర్యాలీని విజయవంతం చేయాలి**

నర్సాపూర్: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో చేపట్టే తెలంగాణ దశాబ్ది ఉత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పిలుపునిచ్చారు. ఆమె శుక్రవారం మాట్లాడారు. బీఆర్‌ఎస్ తెలంగాణ సాధించిన పార్టీగా రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించిందని చెప్పారు. అందులో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జూన్ 1న హైదరాబాద్‌లోని గన్‌పార్కు నుంచి ట్యాంక్ బండ్ సమీపంలోని అమరజ్యోతి వరకు తెలంగాణ ఉత్సవ క్యాండిల్ ర్యాలీ చేపడుతారని చెప్పారు. ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

◆ **విత్తన కొనుగోలుపై అవగాహన సదస్సులు**

తూప్రాన్: అధిక దిగుబడి సాధించేందుకు విత్తన సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణ పరిధిలోని రావెల్లి గ్రామ రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు లూజుగా ఉన్న సంచుల్లో ఉన్న విత్తనాలు కొనుగోలు చేయకూడదని అలాగే విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. తీసుకున్న రసీదు, విత్తన ప్యాకెట్లను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచి పెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఓ గంగుమల్లు, ఏఈఓ సంతోష్ రైతులు పాల్గొన్నారు.